సాక్షి
పెద్దపల్లి
గురువారం । 26 । జనవరి । 2023



ముస్తాబైన పరేడ్‌గ్రౌండ్

పెద్దపల్లిరూరల్: గణతంత్ర వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్‌పరేడ్‌గ్రౌండ్ ముస్తాబైంది. ఉదయం 10గంటలకు కలెక్టర్ సంగీత జాతీయపతాకాన్ని ఆవిష్కరిస్తారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,812

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం పత్తి క్వింటాల్‌కు రూ.7,812 పలికింది. కనిష్టంగా రూ.7,007, సగటున రూ.7,700గా నమోదైంది.

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి పూట ఎండగా ఉంటుంది. సాయంత్రం చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఎత్తిపోతలకు నిధులు మంజూరు చేయండి



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: మంథని నియోజకవర్గంలోని ఉప్పట్ల, వల్లెంకుంట, పలిమెల ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలని నీటి పారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారికి స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు వినతిపత్రం అందించారు. బుధవారం హైదరాబాద్‌లో టీఎస్‌ఐడీసీ చైర్మన్‌ను కలిశారు. ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయాలని, మరమ్మతు చేసి సాగునీరు అందేలా చూడాలని పేర్కొన్నారు. కాసిపేట లిఫ్ట్ ఇరిగేషన్‌తో సుమారు రెండు వేల ఎకరాలు సాగయ్యేదని, గోదావరి వరదలతో ఎత్తిపోతల పథకం దెబ్బతిన్నదని, దానిని మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

సింగరేణి జోలికొస్తే ఊరుకోబోం



మాట్లాడుతున్న చందర్

గోదావరిఖని: సింగరేణి జోలికొస్తే ఊరుకోబోమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆర్జీ–1, సీఎస్‌పీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎండీఆర్–15 కుట్రపూరిత యాక్టును రూపొందించి బొగ్గుబ్లాకులను వేలం వేస్తే ఊరుకోబోమన్నారు. సింగరేణిని నాశనం చేసేందుకు మోదీ సర్కార్ కుట్ర చేస్తోందన్నారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. టీబీజీకేఎస్ నాయకులు గండ్ర దామోదర్‌రావు, జాహిద్‌పాషా, గుండు శ్రావణ్, సుభాష్, జలపతి, తిరుపతిరెడ్డి, జనగామ మల్లయ్య, పుట్ట రమేశ్ పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయానికి భూమిపూజ

యైటింక్లయిన్‌కాలనీ: కార్పొరేషన్‌లోని 18వ డివిజన్ అల్లూరు శివారులో రేణుక ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో అల్లూరు గౌడ సంఘం నాయకులు నారాయణ, స్టాలిన్ గౌడ్, గౌడ్ కుల బంధవులు, కార్పొరేటర్లు, కాలనీ బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సదయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన



శిబిరాన్ని పరిశీలిస్తున్న కుమార్ దీపక్

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్‌లో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం పరిశీలించారు. కార్యక్రమాన్ని ప్రజలందరూ వినియోగించుకునేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్, వైద్యుడు చేరాలు, హెచ్‌వో సమ్మయ్య, వార్డ్ ఆఫీసర్ ఎం.శంకర్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గణ కీర్తి

దేశభక్తి చాటుతున్న ఉమ్మడి జిల్లావాసులు

- స్వాతంత్య్ర, గణతంత్ర వేడుకలకు నేతన్నల జెండా తయారీ
- దేశ సేవలో తరిస్తున్న పలువురు సైనికులు
- పలు చోట్ల నిత్య జనగణమనతో ప్రజల్లో చైతన్యం
- రాజ్యాంగంపై అవగాహన పెంచుకుంటున్న యువత
- నేడు గణతంత్ర దినోత్సవం

ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులు వివిధ రంగాల్లో దేశభక్తి చాటుతున్నారు. స్వాతంత్య్ర, గణతంత్ర, రాష్ట్ర అవతరణ దినోత్సవాల సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన నేతన్నలు జాతీయ జెండాలు తయారు చేస్తుండగా.. ఆ త్రివర్ణ పతాకాలు దేశవ్యాప్తంగా రెపరెపలాడుతున్నాయి. పలువురు సైన్యంలో చేరి దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతుండగా.. నేటి యువతరం సైతం దేశ సేవ చేసేందుకు ఆసక్తి చూపుతోంది. పలు గ్రామాల్లో నిత్య జనగణమన కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజల్లో భేదాభిప్రాయాలు లేకుండా చైతన్యం నింపుతున్నారు. విద్యార్థులు, యువత రాజ్యాంగంపై అవగాహన పెంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. నేడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా కథనం.

నిత్యజనగణమన స్ఫూర్తి

- కట్లకుంటలో 1,891 రోజులు పూర్తి



కట్లకుంటలో నిత్య జనగణమన

కోరుట్ల/మేడిపల్లి: గణతంత్ర స్ఫూర్తి.. నిత్య జనగణమన రూపంలో మేడిపల్లి మండలం కట్లకుంటలో 1,891 రోజులుగా కొనసాగుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో సీఐ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్యజనగణమన ఆదర్శంగా తీసుకున్న కట్లకుంట్ల గ్రామానికి చెందిన భారత్ యూత్ ఆధ్వర్యంలో 2017 నవంబర్ 21న ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు నిత్య జనగణమన కార్యక్రమం రోజూ ఉదయం 9 గంటలకు కొనసాగుతోంది. మొదట భారత్ యూత్ ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమం ప్రస్తుతం గ్రామస్తులందరీ భాగస్వామ్యంతో విజయవంతగా సాగుతోంది. గణతంత్ర స్ఫూర్తిని విడవకుండా గ్రామస్తులు లాక్‌డౌన్ సమయంలోనూ కొనసాగించడం విశేషం. నిత్య జనగణమనకు 2వేల రోజులు పూర్తయిన రోజున ప్రముఖులను ఆహ్వానించి భారీ ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తామని సర్పంచ్ గడ్డం నారాయణరెడ్డి, నిత్య జనగణమన ఇన్‌చార్జి నందు తెలిపారు.

భారీ తిరంగా ర్యాలీ

కరీంనగర్: ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం భారీ జాతీయ జెండాతో (370 మీటర్లు) కోర్టు చౌరస్తా నుంచి రఘునందన్ విగ్రహం వరకు దాదాపు 1,200 మంది విద్యార్థులతో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచకొండ గిరిబాబు, జాతీయ కార్యవర్గ సభ్యులు రాజు సాగర్ ర్యాలీ ప్రారంభించారు. కుల, మత, లింగ వర్ణ వివక్ష లేకుండా ప్రజలందరికీ ప్రాథమిక హక్కులను రాజ్యాంగంలో కల్పించారని, ప్రతీ పౌరుడు హక్కులను ఉపయోగించుకుంటూ, బాధ్యతలను విస్మరించకుండా దేశసేవకు, దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. గణతంత్ర దినోత్సవం అంటే కేవలం జెండా ఆవిష్కరణ చేసి మిఠాయి తినడం కాదని, రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా గణతంత్ర దినోత్సవం కుల, మత, వర్ణ, ప్రాంత భేదాలు లేకుండా ప్రతీ పౌరుడు నిర్వహించుకునే పెద్ద జెండా పండుగ అన్నారు. జిల్లా సంఘటన కార్యదర్శి దేవేందర్, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేష్, పూసాల విష్ణు, బామండ్ల నందు, ప్రవళిక, చందన, శ్రీవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో భారీ తిరంగా ర్యాలీ

నేతన్నల 'జెండా' వందనం!



సిరిసిల్లలో జెండాలు కట్ చేస్తున్న మహిళలు

సిరిసిల్ల: వస్త్రోత్పత్తి ఖిల్లా.. సిరిసిల్ల. ఇక్కడ ఉత్పత్తి అయ్యే బట్టతో జాతీయ జెండాలు(త్రివర్ణ పతాకాలు) తయారవుతున్నాయి. జాతీయ జెండాలు తయారు చేస్తున్న నేతన్నలకు ఉపాధి మెండుగా ఉంటుంది. సిరిసిల్లలో ఉత్పత్తి అయిన వస్త్రాన్ని ప్రాసెసింగ్ చేసి.. మూడు రంగుల్లో ప్రింటింగ్ చేయిస్తారు. ఆ బట్టను జెండాల సైజును బట్టి మిషన్‌పై మహిళలు కుడుతారు. ఎగుర వేసేందుకు సిద్ధంగా ఉన్న జెండాలను ఎగుమతి చేస్తారు.

కలిసొచ్చిన 'స్వాతంత్య్ర' సంబురాలు

దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాలను ఎగుర వేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సిరిసిల్ల నేతన్నలకు చేతినిండా పనిదొరికింది. రాష్ట్ర వ్యాప్తంగా పక్షం రోజులపాటు స్వాతంత్య్ర వజ్రోత్సవ ద్విసప్తాహ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 1.20 కోట్ల జాతీయ జెండాలను కొనుగోలు చేసింది. ఒక్కో జెండా సైజును బట్టి రూ.50 నుంచి రూ.200 వరకు అమ్ముతారు. మహిళలు జెండాలు కుడుతూ.. కట్ చేస్తూ.. ప్యాకింగ్ చేస్తూ.. ఉపాధి పొందుతున్నారు.

ముందే ఆర్డర్లు వస్తాయి



జాతీయ జెండాల ఆర్డర్లు ముందే వస్తాయి. నెల రోజుల కిందటే చాలా జెండాలను సరఫరా చేశాం. సిరిసిల్లలో తయారయ్యే జెండాలు దేశవ్యాప్తంగా సరఫరా అవుతాయి. గత జూలైలో ఐదు లక్షల జెండాలు సరఫరా చేశాను. ఏడాది పొడవునా ఏదో జెండాల ఆర్డర్లు వస్తుంటాయి.

– ద్యావనపల్లి మురళి, వ్యాపారి, సిరిసిల్ల

దేశసేవకు ముందుకొస్తున్న యువత

పెద్దపల్లిరూరల్: నాడు స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన అమరులతో పాటు ప్రస్తుత కాలంలో దేశరక్షణకు సరిహద్దుల్లో పోరాడేందుకు ధైర్యంగా ముందుకొస్తున్న పల్లె యువతకు దేశ ప్రజానీకం నీరాజనాలు పాడుతోంది. పెద్దపల్లి మండలం మారెడుగొండ, బ్రాహ్మణపల్లి గ్రామాల యువకులు దేశ రక్షణకు ఆర్మీలో చేరేందుకు ముందు వరసలో నిలుస్తున్నారు. మారెడుగొండ నుంచి 18 మంది, బ్రాహ్మణపల్లి నుంచి 10మంది సైన్యంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు. ఈసందర్భంగా పలువురి అభిప్రాయాలు.

దేశసేవ చేయడం అదృష్టం



దేశానికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నా. దేశంలో పుట్టినందుకు ఆ దేశ రక్షణ కోసం పనిచేయాలనే తపనతోనే సైన్యంలో చేరా. శిక్షణ సమయంలో కష్టం అనిపించినా తర్వాత పనిచేస్తుండడం చాలా సంతోషాన్నిస్తోంది.

– గుర్రం రమేశ్, మారెడుగొండ

అన్నదమ్ములిద్దరం ఆర్మీలోనే..



దేశ స్వాతంత్య్ర పోరాటం చేసిన సమరయోధుల స్ఫూర్తితో స్వాతంత్య్రానంతరం దేశరక్షణకు పాటుపడే సైన్యంలో పనిచేసే అదృష్టం మా కుటుంబానికి దక్కింది. నాతో పాటు నా సోదరుడు హరీశ్ కూడా సైన్యంలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం ఇద్దరం కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్నాం. దేశ రక్షణలో పాలుపంచుకునే అవకాశం దక్కడం ఎంతో అనుభూతినిస్తోంది.

– పిడుగు శ్రీకాంత్, బ్రాహ్మణపల్లి

రాజ్యాంగంపై అవగాహన అవసరం

సాక్షి, పెద్దపల్లి: విద్యార్థులు, యువతకు భారత రాజ్యాంగంపై అవగాహన ఎంతో అవసరం ఉంది. 74వ రాజ్యాంగ దినోత్సవ సందర్భంగా ట్రినిటి డీగ్రీ కళాశాల విద్యార్థులతో 'రాజ్యాంగం అమలు– ఆవశ్యకత' అంశంపై సెమినార్ నిర్వహించగా పలువురు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. చట్టాలు, పౌర హక్కులు తదితర వాటికి మూలమైన రాజ్యాంగంలో ఏయే అంశాలు పొందుపరిచారు. వాటి అమలుకు ఎలాంటి అధికార వ్యవస్థను ఏర్పాటు చేశారు.. రాజ్యాంగ రచన కోసం అప్పటి మేధావులు చేసి కృషి తదితర అంశాలను విద్యార్థులు 'సాక్షి'తో పంచుకున్నారు.

అందరికీ సమన్యాయం జరిగేలా



స్వాతంత్రోద్యమం తర్వాత మన దేశంలోని ప్రజలందరికీ సమన్యాయం జరిగేలా అప్పటి నాయకులు రాజ్యాంగాన్ని రూపొందించారు. ముఖ్యంగా మహిళల అభ్యున్నత్తికి అనేక అధికరణలను అందులో పొందుపరిచారు. వాటి మీద ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం. నేటి యువతలో స్వాతంత్య్ర దినోత్స వం, రిపబ్లిక్ డేకు తేడా తెలియని పరిస్థితి నెలకొంది. రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవడం అందరి బాధ్యత.

– శ్రీ ప్రణవి, బీఎస్సీ ఫైనల్ ఇయర్

హక్కులతో పాటు విధులు మరవద్దు



దేశంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించేందుకు భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను పొందుపరిచారు. అయితే ప్రతీ పౌరుడు హక్కుల కోసం పోరాటం చేయడం ఎంత అవసరమో ప్రాథమిక విధులను పాటించటం కూడా అంతే అవసరం. రాజ్యాంగంలో కల్పించిన అధికరణలను అందరూ అవగాహన చేసుకొని జీవనం కొనసాగిస్తే మనం మరింత అభివృద్ధి పథంలో ప్రయాణిస్తాం.

– సాక్షిత, బీఎస్సీ ఫైనల్ ఇయర్

రాజ్యాంగంతోనే సమాన అవకాశాలు



దేశానికి స్వాంతంత్య్రం రాక ముందు అందరికీ సమానవకాశాలు లేవు. అప్పటి స్వాంతంత్రోద్యమ నాయకులు వివిధ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి సుదీర్ఘ చర్చలనంతరం అందరికీ ఆమోదయోగ్యమైన రాజ్యాంగాన్ని రూపొందించారు. దీంతోనే ప్రతీ ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించబడ్డాయి. ప్రతీ ఒక్కరి ఇంట్లో ఉండాల్సిన పుస్తకం భారత రాజ్యాంగం. అందులో పొందుపరిచిన అంశాలు తెలిసనప్పుడే మన హక్కులను సాధించుకోగలం.

– సాధ్వి, బీఎస్సీ లైఫ్ సైన్స్

ప్రజలే ప్రభుత్వం



అంబేడ్కర్, ఇతర నేతల సమష్టి కృషితో ప్రపంచంలోనే అతిపెద్దదైన రాజ్యాంగాన్ని మనం రూపొందించుకున్నాం. దీంతో మనదేశం పూర్తిగా గణతంత్ర రాజ్యంగా రూపుదిద్దుకుంది. గణతంత్ర రాజ్యం అంటే ప్రజలే ప్రభుత్వం.. ప్రభుత్వమే ప్రజలు అని అర్థం. ప్రతీ పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రంచించారు. అయితే నేటికి కొన్ని పురాతన చట్టాలను తొలగిస్తూ, ప్రస్తుత సామాజిక ఆర్థిక అంశాల ఆధారంగా రాజ్యాంగ సవరణలు చేయాల్సిన బాధ్యత మన దేశ పార్లమెంటరీ వ్యవస్థ మీద ఉంది.

– అమిత్ శర్మ, బీఎస్సీ ఫైనల్ ఇయర్

పరిశీలిస్తా.. పరిష్కరిస్తా..

- నియోజకవర్గ ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చా
- చౌరస్తాల ఆధునీకరణపై దృష్టి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్

సాక్షి ఫోన్ ఇన్

గోదావరిఖని: నియోజకవర్గంలోని సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వెంటనే ఆయా ప్రాంతాల్లో పర్యటించి వెంటనే పరిష్కరిస్తానని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండంలో మెడికల్ కళాశాల ఏర్పాటుతో ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులోకొచ్చిందన్నారు. గోదావరి నదిపై టూరిజం సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చానని తెలిపారు. బుధవారం 'సాక్షి' నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు ఏకరువు పెట్టారు. వాటికి సమాధానాలు ఇచ్చారు.



సాక్షి ఫోన్‌ఇన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రశ్న: రెండోవిడత దళితబంధులో అవకాశం ఉంటుందా..? – సువర్ణ, అల్లూరు, బొడ్డు స్వరూప, 46వ డివిజన్

ఎమ్మెల్యే: నేరుగా వచ్చి దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం. ఏ యూనిట్ కావాలి..? ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నారు..? పూర్తి వివరాలు ఇస్తే తప్పకుండా ఎంపిక చేస్తాం.

ప్రశ్న: డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎప్పుడిస్తారు..?

– ఆస్మా, 41వ డివిజన్

ఎమ్మెల్యే: డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తి చేస్తాం. లబ్ధిదారులకు సాధ్యమైనంత తర్వగా అందించేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. యువత చెడు వ్యసనాల వైపు మళ్లకుండా పోలీసులతో కౌన్సెలింగ్ ఏర్పాటు చేయిస్తాం. స్పెషల్ డ్రైవ్ నిర్వహించేలా చూస్తాం.

ప్రశ్న: కోల్‌కారిడార్ రోడ్డుపై గుంతలతో ప్రమాదాలు జరుగుతున్నాయి..?

– శ్రీనివాస్, కమాన్‌పూర్

ఎమ్మెల్యే: సెంటినరీకాలనీకి వచ్చే రోడ్డును సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసి త్వరగా మరమ్మతులు చేయిస్తాం. ప్రమాదాలు లేని రోడ్డుగా తీర్చిదిద్దుతాం.

ప్రశ్న: కూరగాయల మార్కెట్ వద్ద డ్రైనేజీ కుంగిపోయింది. పట్టణ ప్రగతి పనులు నిలిచిపోయాయి. మల్లికార్జున్‌నగర్ వద్ద బ్రిడ్జి లేక పిల్లలు ఇబ్బంది పడుతున్నారు..?

– తోట శ్రీనివాస్, సామాజిక నాయకులు

ఎమ్మెల్యే: మీరు చెప్పిన సమస్యల్లో కొన్ని ఇప్పటికే మా దృష్టికి వచ్చాయి. ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. విద్యార్థులు ఇబ్బంది పడకుండా బ్రిడ్జి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: రోడ్లు, డ్రైనేజీలు మరమ్మతు చేయించండి.. – లక్ష్మణ్, 2వ డివిజన్

ఎమ్మెల్యే: ఇప్పుడే మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి ఆదేశాలు జారీ చేస్తాను. వారు వెంటనే వచ్చిన చెత్త తొలగించేలా చూస్తాను.

రేషన్‌బియ్యం రీసైక్లింగ్ చేసే మిల్లర్లపై చర్యలు

పెద్దపల్లిరూరల్: జిల్లాలో రేషన్ బియ్యం రీసైక్లింగ్ దందా సాగుతోందనే ఆరోపణల నేపథ్యంలో సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, రీసైక్లింగ్ పాల్పడే మిల్లర్లపై కఠినచర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. బుధవారం జెడ్పీలో స్థాయి సంఘాల సమావేశాలకు అధ్యక్షత వహించారు. రేషన్‌బియ్యం దందా పై సంబంధిత అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలపై ఆరా తీయాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు సమయపాలన పాటించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తప్పవన్నారు. మంథనిలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలతో ఇబ్బందులున్నాయని, మరమ్మత్తు పూర్తి చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ శ్రీనివాస్, జెడ్పీటీసీలు బండారి రామ్మూర్తి, తిరుపతిరెడ్డి, నారాయణ, దివాకర్, డీఆర్‌డీఓ శ్రీధర్, డీఎస్‌ఓ వెంకటేశ్ ఉన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు

పెద్దపల్లిరూరల్: మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం డీసీపీ రూపేశ్‌తో కలిసి డ్రగ్స్ వినియోగంపై సమీక్షించారు. జిల్లాలో గుర్తించిన డ్రగ్స్ అడిక్షన్ కేసుల వివరాలపై ఆరా తీశారు. మైనర్ విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి సరఫరా.. వినియోగం తదితర వివరాలను శనివారంలోపు అందించాలని ఆదేశించారు. పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్రహరీ క్లబ్ పనితీరుపై నివేదించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యాలయాలకు వందమీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని, బెల్టుషాపులపై ఫిర్యాదులందితే సత్వరమే మూసివేయించాలని ఆదేశించారు. స్కూళ్లకు సమీపంలో ఉన్న కిరాణ, పాన్‌షాపులను తనిఖీ చేసి సిగరెట్, పొగాకు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆకస్మిక తనిఖీలు చేసి విద్యార్థుల అలవాట్లను పరిశీలించాలన్నారు. పాఠశాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వివరాలను అందించాలని ఆదేశించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి రవుఫ్‌ఖాన్, డీఈఓ మాధవి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్ రెడ్డి, జెడ్పీ డెప్యూటీ సీఈఓ వెంకటచైతన్య, డ్రగ్ ఇన్స్‌పెక్టర్ చందన, సైక్రియాట్రిక్ సాత్విక్‌మైత్రి తదితరులున్నారు.

30లోగా స్కాలర్‌షిప్ అప్లికేషన్‌లు పూర్తి చేయాలి

ముత్తారం: ఈనెల 30లోగా స్కాలర్‌షిప్ అప్లికేషన్‌లు పూర్తి చేయాలని మంథని ఆర్డీవో వీరబ్రహ్మాచారి అన్నారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఐదో తరగతి నుంచి ఇంటర్ చదివే ఎస్సీ విద్యార్థుల నుంచి స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేయించాలని సూచించారు. కులం, ఆదాయం, బ్యాంక్ పాస్‌బుక్ ఇప్పించే బాధ్యత ప్రధానోపాధ్యాయులదే అన్నారు. మండలంలో మొత్తం 66 మంది ఎస్సీ విద్యార్థులు ఉన్నారని ప్రతి ఒక్కరికి ధరఖాస్తు చేయించాలని అన్నారు. అదే విధంగా తహసీల్దార్ కార్యాలయంలో పెండింగ్ పనులు లేకుండా చూసుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ ఉదయ్‌కుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ మధన్‌మోహన్‌తో పాటు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో వీరబ్రహ్మాచారి

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


కోట రమేశ్‌ (ఫైల్‌)

పాలకుర్తి: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం పాతగూడూరు గ్రామానికి చెందిన కోట రమేశ్‌ (36) మండలకేంద్రంలో బుధవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్‌ కుటుంబ సభ్యులు, బసంత్‌నగర్‌ పోలీసుల కథనం ప్రకారం.. రమేశ్‌ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ వివాహితతో తనకు వివాహేతర సంబంధం ఉందటూ సోషల్‌మీడియాలో వాయిస్‌ మెసేజ్‌ పోస్ట్‌ చేశాడు. దీంతో సదరు మహిళ వెల్గటూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆందోళనకు గురైన రమేశ్‌ కేసు భయంతో సోమవారం రాత్రి పాలకుర్తిలోని తన అత్తగారింటికి వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి దాటాక రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని బసంత్‌నగర్‌ ఎస్సై శ్రీనివాస్‌ పరిశీలించారు. రమేశ్‌ భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వాహనాల వేలం

గోదావరిఖని: రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధి.. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలోని వివిధ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో పట్టుబడిన 192 మోటార్‌ సైకిళ్లు, నాలుగు మూడు చక్రాల వాహనాలకు వేలం వేస్తున్నట్లు రామగుండం ఇన్‌చార్జి కమిషనర్‌ సత్యనారాయణ తెలిపారు. ఆర్నెళ్ల నుంచి వాహనాల కోసం ఎవరూ రానందున అన్‌నోన్‌ ప్రాపర్టీగా పరిగణించి బెల్లంపల్లి సీఏఆర్‌ హెడ్‌క్వార్టర్‌లో ఉంచామని, వాటికి ఈనెల 30న వేలం వేస్తామని ప్రకటించారు. బహిరంగ వేలంలో పాల్గొనేవారు ఆధార్‌ కార్డు, గుర్తింపు కార్డులు, ఇతర పత్రాలు తెచ్చుకోవాలని సూచించారు.

సంజయ్‌ వర్సెస్‌ శ్రావణి..!

- జగిత్యాల బీఆర్‌ఎస్‌లో భగ్గుమన్న విభేదాలు
- వేధింపులు తాళలేక రాజీనామా: శ్రావణి
- ఆ ఆరోపణలతో సంబంధం లేదు: ఎమ్మెల్యే
- అవిశ్వాసానికి ముందే చైర్‌పర్సన్‌ రాజీనామా
- జగిత్యాల మున్సిపల్‌ రాజకీయ ఉత్కంఠకు తెర


దొరా.. దండం పెడుతా అంటున్న శ్రావణి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌/జగిత్యాల: జగిత్యాల మున్సిపల్‌ అవిశ్వాస డ్రామాకు తెరపడింది. వారంరోజులుగా నివురుగప్పిన నిప్పులా సాగుతున్న రాజకీయ ఉత్కంఠకు మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ భోగ శ్రావణి రాజీనామాతో తెరపడింది. కౌన్సిల్‌లో తనకు వ్యతిరేకంగా 27 మంది కౌన్సిలర్లు తిరుగుబాటు చేయడం, ఎమ్మెల్యేతో విభేదాలు తారాస్థాయికి చేరడంతో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ శ్రావణి రాజీనామా చేశారు. మూడేళ్లపాటు ఆయన వేధింపులు మౌనంగా భరించిన తాను.. ఇక భరించడం తన వల్ల కాదని, అందుకే తప్పుకుంటానని విలేకరుల సమావేశంలో కన్నీటి పర్యంతమవడం ఒక్క జగిత్యాలలోనే కాదు.. రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ కాకరేపుతోంది. మంగళవారం జగిత్యాల జిల్లా బీఆర్‌ఎస్‌ పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణ సైతం చైర్‌పర్సన్‌తో సమావేశమయ్యారు. ఆ సమావేశంలో ఏం జరిగిందో లేదో కానీ బుధవారం చైర్‌పర్సన్‌ శ్రావణి ఆకస్మికంగా సంచలన నిర్ణయం తీసుకున్నారు. తొలుత అంతా అవిశ్వాసానికి మొగ్గు చూపుతున్నారని అనుకున్నా.. శ్రావణి అందరి అంచనాలు తలకిందులు చేస్తూ.. రాజీనామా చేయడం జిల్లా రాజకీయాల్లో సంచలనం రేపింది.

శ్రావణి వ్యూహాత్మక దాడి..!

భోగ శ్రావణి జగిత్యాల జిల్లా ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు తీవ్ర సంచలనం రేపుతున్నాయి. ఎమ్మెల్సీ కవిత ఆశీస్సులతో చైర్‌పర్సన్‌ అయ్యాననే అక్కసుతో మూడేళ్లుగా వేధిస్తున్నారని బహిరంగంగానే మండిపడ్డారు. తనను పదవిలో కొనసాగించడం ఆయనకు ఇష్టం లేకనే కౌన్సెలర్లను ఇంటికి పిలిపించి బెదిరించారన్నారు. తనకు వ్యతిరేకంగా జరుగుతున్న అవిశ్వాసాన్ని తట్టుకోలేక మనస్తాపంతో రాజీనామా చేస్తున్నాని శ్రావణి చెప్పారు. ఓవైపు మంత్రి కేటీఆర్‌, ఎమ్మెల్సీ కవితల ఆశీస్సులు ఉన్నాయని తెలిసే తనపై ఎమ్మెల్యే వేధింపులకు పాల్పడటం బీఆర్‌ఎస్‌లో కొత్త చర్చకు దారితీసింది. బీసీ మహిళ అయినందుకే తనను హేళన చేశారని, అయినా కేటీఆర్‌, కవిత కోసం ఇంతకాలం భరించానని వివరించారు. తాను పార్టీకి వ్యతిరేకం కాదని, అధిష్టానం కూడా తన వెంటే ఉందని, కేవలం ఎమ్మెల్యే వేధింపులు భరించలేకనే పదవిని వీడుతున్నానని వ్యూహాత్మకంగా చెప్పకనే చెప్పారు. అయితే.. శ్రావణి రాజీనామా వ్యవహారంతో తనకెలాంటి సంబంధం లేదని ఎమ్మెల్యే స్పష్టంచేయడం పార్టీ అభిమానుల్లో గందరగోళానికి దారితీసింది.

20 గంటల్లోనే మారిన పరిణామాలు..!

అవిశ్వాసం పెట్టాలని కౌన్సిలర్లు ఇచ్చిన లేఖలు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌.. జిల్లా మంత్రి కొప్పుల ఈశ్వర్‌, జిల్లా బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. ఇదేవిషయంపై మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో జగిత్యాలలోని పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణ, చైర్‌పర్సన్‌ భోగ శ్రావణితో సమావేశమయ్యారు. ఎన్నికలు రాబోతున్న తరుణంలో అవిశ్వాసాలు కూడదని పైనుంచి అధిష్టానం వారించినట్లు చర్చ జరిగినట్లు సమాచారం. ఈ మొత్తం వ్యవహారం టీకప్పులో తుఫానుగా సమసిపోతుందని అంతా భావించారు. ఈ తరుణంలో బుధవారం మధ్యాహ్నానికి పరిస్థితులు తారుమారయ్యాయి. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ శ్రావణి బుధవారం ఉదయం జిల్లా బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీ రమణతో సమావేశమవడం, ఆ వెంటనే మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేస్తూ రాజీనామా చేయడం జగిత్యాలలో చర్చనీయాంశంగా మారింది. కేవలం 20 గంటల వ్యవధిలో జిల్లా రాజకీయాలు పూర్తిగా మారిపోయాయి.

రాజీనామాతో ఉలిక్కిపాటు...!

రాజీనామా చేస్తూ చైర్‌పర్సన్‌ కలెక్టర్‌కు లేఖ పంపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. పదవీ నుంచి దిగే అవకాశాలు లేకున్నా రాజీనామా చేయడంతో ఈ అంశం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక ఏవైనా రాజకీయ వ్యూహం ఉందా, లేక పార్టీలో ఇమడలేకనే రాజీనామా చేశారా? అన్న విషయంలో జిల్లా బీఆర్‌ఎస్‌ పార్టీలో జోరుగా చర్చ నడుస్తోంది.

అధిష్టానం వైపే అందరి చూపు..!

చైర్‌పర్సన్‌ శ్రావణి తన పదవికి రాజీనామా చేస్తూ లేఖ రాయడంతో అందరి చూపు అధిష్టానం వైపే మళ్లింది. రాజీనామాకు ముందు శ్రావణి జిల్లా మంత్రి, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే, కౌన్సిలర్లకు తన నిర్ణయాన్ని తెలియజేశారా? లేక ఆమె ఆకస్మికంగా నిర్ణయం తీసుకున్నారా? ఇంకా స్పష్టత రాలేదు. శ్రావణి రాజీనామా ఆమోదం పొందుతుందా? లేక వీరిద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు చొరవ తీసుకుంటుందా? అన్న విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

ప్రజలను గోస పెడుతున్న కేసీఆర్‌ సర్కార్‌


సమస్యలపై ఆరాతీస్తున్న విజయ్‌

పెద్దపల్లిరూరల్‌: సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలను గోస పెట్టేలా సీఎం కేసీఆర్‌ పాలన సాగుతోందని కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరమణారావు ఆరోపించారు. పెద్దపల్లిలో 4, 23వ వార్డులో బుధవారం గడపగడపకూ కాంగ్రెస్‌ కార్యక్రమంలో పాల్గొని సమస్యలపై ఆరా తీశారు. పెద్దపల్లిలో ఇంటిపన్ను, కరెంట్‌ బిల్లులను అడ్డగోలుగా పెంచి మోయలేని భారాన్ని మోపారన్నారు. రేషన్‌ దుకాణాల్లో వైఎస్సార్‌ పాలనలో తొమ్మిది రకాల నిత్యావసర సరుకులతో కూడిన సంచి అందిస్తే ఇప్పటి కేసీఆర్‌ సర్కార్‌ కేంద్రంలోని మోదీ ఇస్తున్న ఐదుకిలోల బియ్యాన్నే పంపిణీ చేస్తూ ప్రజలను మోసగిస్తున్నారన్నారు. అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్‌తోనే మేలు కలుగుతుందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు పుష్పలత, మల్లయ్య, సంపత్‌, సుభాష్‌రావు, నాయకులు సురేశ్‌గౌడ్‌, శ్రీమాన్‌, చందు తదితరులున్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికులకు ఐఎన్టీయూసీ అండ


మాట్లాడుతున్న బాబర్‌ సలీంపాషా

జ్యోతినగర్‌: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు ఐఎన్టీయూసీ అండగా ఉంటుందని యూనియన్‌ జాతీయ కార్యదర్శి బాబర్‌ సలీం పాషా అన్నారు. బుధవారం పర్మనెంట్‌ టౌన్‌షిప్‌లోని మజ్దూర్‌ యూనియన్‌ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 2018 ఒప్పందంలోని పెండింగ్‌ అంశాలను అమలు చేయాలని, ఒప్పందం కాల పరిమితి ముగిసినా కొత్త ఒప్పందంపై కార్యాచరణ రూపొందించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కొంతమంది కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ పబ్బం గడుపుకుంటున్నారని, కార్మిక సంఘాల నాయకులు కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో అగ్రభాగాన ఉండాలని పేర్కొన్నారు. కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం చేసేందుకు యూనియన్‌ యాజమాన్యంతో చర్చించనున్నట్లు వివరించారు. కార్మికుల శ్రేయస్సుకు పూర్తిగా సహకరిస్తామన్నారు. అనంతరం కార్మికులు బాబర్‌ సలీంపాషాకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు కందుల స్వామి, భూమల్ల చందర్‌, సత్యం, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


రామయ్య (ఫైల్‌)

ముత్తారం: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముత్తారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. మంథని మండలం ధర్మారం గ్రామానికి చెందిన ఏలువాక రామయ్య (40)కు ముత్తారం మండలం ఇప్పలపల్లి శివారులో మూడెకరాల భూమి ఉంది. మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా దిగుబడి రాకపోవడంతో సుమారు రూ.ఆరు లక్షలు అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలంటూ ఇంట్లో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన ఆయన క్రిమి సంహారక మందు తాగానని కుటుంబ సభ్యులకు ఫోన్‌ చేసి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని చికిత్స కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్‌ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామయ్య భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాములు తెలిపారు.



పదోన్నతుల పరీక్ష

పెద్దపల్లిరూరల్‌: పదోన్నతుల కోసం నిరీక్షిస్తున్న ఉపాధ్యాయులంతా తమ సీనియారిటీ వివరాలను రాసేందుకు ఇలా పెద్దపల్లి మండల విద్యావనరుల కేంద్రం ముందు బారులుదీరారు. ప్రభుత్వం కనీసం రెండేళ్ల సీనియారిటీని పరిగణలోకి తీసుకుంటామని పేర్కొంటుండగా ఉపాధ్యాయసంఘాల నేతలు జీరో సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఉపాధ్యాయులు మాత్రం తమ సీనియారిటీ వివరాలను నమోదు చేసిన దరఖాస్తులను విద్యాశాఖ అధికారులకు అందించే పనిలో నిమగ్నమయ్యారు.



ఓటరు దేశ భవిష్యత్తు నిర్ణేత

- సీనియర్‌ ఓటర్ల స్ఫూర్తి ఆదర్శం
- ఓటు హక్కు వినియోగించుకోండి
- కలెక్టర్‌ సంగీత వెల్లడి
- ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం


మాట్లాడుతున్న కలెక్టర్‌ సంగీత, డీసీపీ రూపేశ్‌

పెద్దపల్లిరూరల్‌: దేశభవిష్యత్తు ఓటరు చేతిలోనే ఉందని, అందరూ ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్‌ సంగీత అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అడిషనల్‌ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌ దీపక్‌తో కలిసి మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ ఉన్న దేశంలో ప్రతి ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించుకుంటున్నామని, ఓటు హక్కు ఉన్న ప్రతిఒక్కరూ నిష్పక్షపాతంగా ఓటును వినియోగించుకోవాలని సూచించారు. 18ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించామని, కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టామని వెల్లడించారు. సీనియర్‌ ఓటర్లు ప్రతి ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకుంటూ స్ఫూర్తిగా నిలిచారని, 'నేను కచ్చితంగా ఓటు వేస్తా..' అనే నినాదంతో ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్‌ ఓటర్లను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వెంకటమాధవరావు, ఏఓ ప్రసాద్‌, తహసీల్దార్‌ వెంకటలక్ష్మి, ఎలక్షన్‌ డీటీ ప్రవీణ్‌ తదితరులున్నారు.

'చీకటిపువ్వు' నాటికకు ద్వితీయ బహుమతి

కరీంనగర్‌ కల్చరల్‌: గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో ఈ నెల 22 నుంచి 24వరకు ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు జరిగాయి. కరీంనగర్‌ చైతన్య కళాభారతి వారు ప్రదర్శించిన 'చీకటిపువ్వు' నాటికకు ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ నటి లహరి, ద్వితీయ ఉత్తమ రచన పరమాత్ముని శివరాం, ద్వితీయ ఉత్తమ రంగాలంకరణ కేదారి నాగు బహుమతులు గెలుచుకున్నారు. ఈ బహుమతితో నాటిక ఇప్పటివరకు 18 ఉత్తమ ప్రదర్శన అవార్డులు, 72 వ్యక్తిగత బహుమతులు సాధించింది. నటీనటులు కొత్తకొండ సత్యనారాయణ, శివరాంరెడ్డి, లహరి, శివరాం అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారు. సంగీతం సురభి నాగరాజు, ఆహార్యం, రంగాలంకరణ, లైటింగ్‌ కేదారి నాగు అందించారు.

27, 28 తేదీల్లో దివ్యాంగుల ఉపకరణాల శిబిరం

కరీంనగర్‌టౌన్‌: కరీంనగర్‌ పార్లమెంట్‌ పరిధిలో దివ్యాంగులకు ఉపకరణాల మూల్యాంకన శిబిరం ఈ నెల 27న కరీంనగర్‌ అంబేడ్కర్‌ స్టేడియంలో, 28న హుజూరాబాద్‌ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు బీజేపీ కరీంనగర్‌ పార్లమెంటు కన్వీనర్‌ బోయినపల్లి ప్రవీణ్‌రావు తెలిపారు. కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తోందన్నారు. కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అలింకో సంస్థ ద్వారా ఉపకరణాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. చేతి కర్రలు, చంక కర్రలు, వీల్‌ చైర్లు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు, రోలో టేర్స్‌, ఎంఆర్‌ కిట్‌, స్మార్ట్‌ కేన్‌, అంధుల చేతి కర్ర, ఎల్బో కచ్చస్‌, బాగైన కుష్టు వ్యాధిగ్రస్తులకు లెప్రసీ కిట్‌, డైసీ ప్లేయర్‌, కృత్రిమ అవయవాలు, ఇతర ఉపకరణాలు, సహాయ పరికరాలు ఇస్తారన్నారు.









గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న నారాయణ

గోదావరిఖని: సింగరేణిలో 74వ గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. ఆర్జీ–1, 2 ఏరియాల్లో ఆయా జీఎంలు కె.నారాయణ, ఎ.మనోహర్‌ వేర్వేరుగా జాతీయ పతాకాలు ఎగురవేసే మైదానాలను పరిశీలించారు. గోదావరిఖని జవహర్‌లాల్‌ నెహ్రూ స్టేడియం, యైటింక్లయిన్‌కాలనీలోని అబ్దుల్‌కలాం స్టేడియంలను పరిశీలించి సలహాలు చేశారు. అధికారులు లక్ష్మీనారాయణ, నవీన్‌, వసంత్‌ కుమార్‌, సలీం, సారంగపాణి, ఎస్‌ఓటూ జీఎం సలీం, డీజీఎం పర్సనల్‌ రాజేంద్రప్రసాద్‌ తదితరులున్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్‌

5,371 మందికి కంటిపరీక్షలు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలో బుధవారం 5,371 మందికి కంటివెలుగు కార్యక్రమం కింద నేత్రపరీక్షలు నిర్వహించామని జిల్లా వైద్యాధికారి డాక్టర్‌ ప్రమోద్‌కుమార్‌ తెలిపారు. ఇందులో 850మందికి అద్దాలను అందించామన్నారు. మరో 735మందికి అవసరమైన అద్దాలను ఆర్డర్‌పై తెప్పించి ఇస్తామని వివరించారు. 1585మందికి లోపాలు ఉన్నట్లు గుర్తించామని వారిలో 359మందికి మరింత మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రులకు రెఫర్‌ చేసినట్లు వివరించారు.